క్లుప్తంగా

ఉపాధి వేతనంలో కోతలపై పీడీ తనిఖీలు


ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

చిల్లకూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసే ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో వేతనాలందక కోత పడుతోందన్న ఫిర్యాదులపై తనిఖీలు చేస్తున్నట్లు పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మండలంలోని తిమ్మనగారిపాళెంలో జరిగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామంలోని చెరువులో చేపడుతున్న కమ్యూనిటీ పాండ్ పనులను తనిఖీ చేసిన అనంతరం అక్కడ పని చేసే కూలీలతో మాట్లాడారు. తక్కువ వేతనం అందుతోందని చెప్పడంతో టెక్నికల్ అసిస్టెంట్, ఈసీలతో మాట్లాడారు. పనికి తగ్గట్లుగానే సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పీడీ వేతనదారులతో మాట్లాడుతూ కమ్యూనిటీ పాండ్ పనులు చేసే సమయంలో కేంద్ర ప్రభుత్వం అందించే రూ.307 ఎలా తీసుకోవచ్చనే విషయాలను వారికి దగ్గర ఉండి తెలియజేశారు. ఆయన వెంట ఉపాధి ఏపీఓ గిరిబాబు ఉన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిట్టమూరు : మండల పరిధిలోని మల్లాం, ఈశ్వరవాక గ్రామాల పీహెచ్‌సీలలో శుక్రవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా సాగుతోందని వైద్యులు తెలిపారు. రెండు గ్రామాల్లో ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యులు తెలిపారు. ఈశ్వరవాక పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్ రెడ్డి, మల్లాం పీహెచ్‌సీ వైద్యుడు మదన్‌మోహన్, స్విమ్స్ మెడికల్ అధికారులు చైతన్యభాను, పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ర్యాక్స్ వితరణ


ఐరన్ ర్యాక్స్‌ను పాఠశాలకు అందిస్తున్న దాతలతో రోటరీ క్లబ్ సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు మండలంలోని దివిపాళెంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఐరన్ ర్యాక్స్ వితరణ చేశారు. రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొణిదల మునిగిరీష్‌తోపాటుగా అతని సోదరుడు మునిభాస్కర్ దాతృత్వంతో వారి తండ్రి మునిరామయ్య జ్ఞాపకార్థం శుక్రవారం రూ.20 వేల విలువ చేసే ఐరన్ ర్యాక్స్ వితరణగా అందజేశారు. క్లబ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లురెడ్డి, కార్యదర్శి మల్లు విజయకుమార్‌రెడ్డి, సభ్యులు దశరథ రామిరెడ్డి, బాలక్రిష్ణంరాజు, బీవీ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌వీ రత్నం, జీజీ నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న దాతలు

దొరవారిసత్రం : మండలంలోని పోలిరెడ్డిపాళెంలో ప్రాథమిక పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ సేవా సంస్థ వారు ప్లేట్లు, గ్లాసులతో పాటు విద్యాసామగ్రి అందజేశారు. సేవా సంస్థకు చెందిన హేమలత మనుమరాలు సంజన పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సంస్థ నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రీజనల్ సెక్రటరీ ఆదిశేషారెడ్డి, అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి అరుణకుమారి, సభ్యులు, టీచర్స్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

దక్కిలి : పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని గూడూరు డీఎల్‌డీఓ వాణిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా కూడా పారిశుధ్యం నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. సైడ్ డ్రైన్‌లు, తాగునీటి బోర్ల వద్ద బ్లీచింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ గుణశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నరసింహులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు 19.07.2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	120
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	240
లేయర్ చికెన్	:	190

శాకాంబరిగా చెంగాళమ్మ పరమేశ్వరి




పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆయనతోపాటు భక్తులు కూరగాయలు, పండ్లు అమ్మవారికి కానుకగా అందజేశారు. కాయగూరలతో శాకాంబరిగా అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగా ప్రసాద్, తానంకి నానాజీ దంపతులు ఉన్నారు. వీరిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.
- సూళ్లూరుపేట

ఎమ్మెల్యే కోసం పడిగాపులు

దొరవారిసత్రం: మండలంలోని తనియాలి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు రావాల్సిన స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాత్రి ఏడు గంటల పైబడి రావడంతో కూటమి నాయకులు, వివిధ శాఖ అధికారులు పడిగాపులు కాయాల్సివచ్చింది. స్థానిక కూటమి నాయకుల్లో ఉన్న విభేదాల కారణంగా రెండు స్థలాల్లో సమావేశాలు నిర్వహించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

23న ఉచిత వైద్య శిబిరం

గూడూరురూరల్ : పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ నెల 23న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు, కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య పరీక్షలు

వాకాడు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండల వైద్య బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రైమరీ హెల్త్ చెకప్ చేసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

నెల్లూరు జెడ్పీలో గళం విప్పిన అనిల్


మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

కలువాయి(సైదాపురం): నెల్లూరు జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో కలువాయి మండలంలో నెలకొన్న సమస్యలపై జెడ్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను వెలుగు సిబ్బంది ఎందుకు రికవరీ చేయడం లేదని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నించారు. బీపీఎన్ ఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో చికెన్ షాపులు పెట్టి వాటి వ్యర్థాలను పాఠశాలల్లోనే వేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

సమస్యలు పరిష్కరించే వరకు పనులకు వెళ్లం


గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

గూడూరురూరల్ : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు పనులకు వెళ్లే ప్రసక్తే లేదని మున్సిపల్ కార్మికులు పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) అనుబంధం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టి శుక్రవారం ఆరో రోజుకు చేరింది. పారిశుధ్య కార్మికులు కూడా దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సమ్మెబాట చేపట్టి మూడో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దారా కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు జోగి శివకుమార్, సీఐటీయూ గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, మణి, శాంతి వర్ధన్ పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో దుర్గాదేవి



నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారు గాజుల అలంకరణలో నిపించారు. ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారి శుక్రవారం అభిషేకాలు జరిపి అనంతరం గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు.

వైభవంగా మహారుద్రాభిషేకం



గూడూరురూరల్: పట్టణంలోని పటేల్ వీధిలో వెలసిన శ్రీ విజయదుర్గ అమ్మవారి ఉప పీఠంలో శుక్రవారం పిఠాపురం వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయస్వామి విశేష అనులోమ విలోమ సహిత మన్యు పాశుపత మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసినట్లు నిర్వాహకులు కోట సునీల్ కుమార్ తెలిపారు.

హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం తీరు వివాదాస్పదం


పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

నాయుడుపేటటౌన్ : హైస్కూల్ ప్లస్ విద్యార్థినులను జుట్టు పట్టి లాక్కెళ్లిన హెచ్‌ఎం తీరు వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళితే, పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ (జూనియర్ కళాశాల)గా అప్‌గ్రేడ్ చేశారు. అయితే ఈ పాఠశాలకు కొత్తగా వచ్చిన హెచ్‌ఎం మంజుల విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులతోనూ దురుసుగా వ్యవహరిస్తున్నారని వారు శుక్రవారం కళాశాలలోనే ఆందోళనకు దిగారు. విద్యార్థినులు మీడియాతో మాట్లాడుతూ, కొత్తగా విద్యార్థినులను పాఠశాలలో చేర్చుకోవడం లేదని చెప్పారు. కళాశాలలో గురువారం జరిగిన యూనిట్ పరీక్షలను హైస్కూల్లోకి వచ్చి రాయాలని ఆదేశించారు. అయితే ఇక్కడి నుంచి అక్కడికెళ్లి పరీక్షలు రాయడమేంటో అర్థం కాక విద్యార్థినులు కొంత సమయం అయోమయానికి లోనయ్యారు. ఇంతలోనే హెచ్‌ఎం విద్యార్థినుల జుట్టు పట్టుకుని మరి హైస్కూల్లోకి లాక్కెళ్లినట్లు తెలిపారు. టీసీలు ఇచ్చి పంపించేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇదే విషయమై హెచ్‌ఎం మంజులను సంప్రదించగా, అక్కడి ఉన్నత పాఠశాలతో పాటు కళాశాలకు తానే హెచ్‌ఎం అని, తాను ఏది చెబితే అది చేయాల్సిందే అని స్పష్టం చేశారు. ఇక్కడ ఉపాధ్యాయులు కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అయితే తాను విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవర్తించలేదని తెలిపారు. దీనిపై డిప్యూటీ డీఈఓ సనత్‌కుమార్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మా ఊరి బడి మాకు కావాలి

వెంకటగిరి రూరల్: తమ గ్రామంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలను యథావిధిగా నిర్వహణ కొనసాగించాలని మండలంలోని పాళెంకోట విద్యార్థుల తల్లిదండ్రులు, పీడీఎస్‌ఓ నేతలు స్పష్టం చేశారు. పాళెంకోట పాఠశాలను మొక్కలపాడు పాఠశాలలో విలీనం చేయడంపై గ్రామస్తులు మండిపడ్డారు. గొడ్డేరు వాగు అవతలకు తమ పిల్లలను పంపలేమంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ బాబాయ్య పాళెంకోటకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు.

పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి

సైదాపురం: మండలంలోని పోతేగుంట దళితవాడలో ఉన్న పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కాలనీవాసులతో పాటు ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఈ బడిలో 28 మంది విద్యార్థులుంటే అందులో 18 మందిని కిలోమీటర్ దూరంలోని పోతేగుంట పాఠశాలకు తరలించడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందా వెంకటేశ్వరరావు, గోచిపాత వెంకటేశ్వర్లు, పందిటి అంబేడ్కర్, సూరిపాక ఉదయ్, గంగాధర్, ఉదయ్, ఏడుకొండలు ఉన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ బాబయ్య


పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులతోఎమ్మార్పీఎస్ నేతలు

తపాలా సేవల్లో అంతరాయం

సూళ్లూరుపేట/గూడూరు రూరల్ : సూళ్లూరుపేట, గూడూరు పట్టణంలోని తపాలా కార్యాలయాల్లో సురక్షిత సేవల కోసం నూతన సాంకేతిక విధానం ఐటీ 2.0 రోల్ అవుట్ ఉన్న కారణంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు లావాదేవీలు నిలిపివేస్తున్నామని తపాలా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి సరికొత్తగా ఆధునీకరించిన నూతన సాంకేతిక విధానాన్ని తీసుకొచ్చి 22 నుంచి సేవలను అందించనున్నామని తెలిపారు. అందుకే మూడు రోజులపాటు లావాదేవీలు వుండవని తెలిపారు. అంటే శని, సోమవారాల్లో సేవలు నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు అందరూ ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

కండలేరులో 29.294 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 29.294 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1950, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టర్ల వివరాలు తెలపండి

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పరిధిలో ఉన్న చెరువుల విస్తీర్ణంతోపాటు అనుమతులు పొందిన మట్టి కాంట్రాక్టర్ల వివరాలను తెలియజేయాలని ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఆరి శంకరయ్య శుక్రవారం ఇరిగేషన్ డీఈఈని కలిసి వినతి పత్రం అందించారు. మున్సిపాలిటీ, రూరల్ పరిధిలో ఉన్న ఒక్కో చెరువు విస్తీర్ణం, వాటి సర్వే నెంబర్లు తెలియజేయాలన్నారు. చెరువులో మట్టి తోలుకునేందుకు ఎంతమంది కాంట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చారో వివరాలు తెలియజేయాలని ఆరి శంకరయ్య కోరారు.

తాగునీరు సరఫరా చేయలేం

చిల్లకూరు: విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా శనివారం గూడూరు పట్టణంలో పూర్తి స్థాయిలో పట్టణ ప్రజలకు తాగునీటిని అందించలేక పోతున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గూడూరు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా పట్టణంలోని తాగునీటి ట్యాంకులకు పూర్తి స్థాయిలో నీటితో నింపలేకున్నామని దీని వల్ల పట్టణ ప్రజలకు కూడా పూర్తి మోతాదులో నీరు ఇవ్వలేక పోతున్నామని దీనిని పట్టణ ప్రజలు గుర్తించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

విద్యుత్ కోతతో ఇక్కట్లు

గూడూరు మండలంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో చిరు వ్యాపారులతో పాటుగా ఉద్యోగులు, ఆస్పత్రిలోని రోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యుత్ శాఖాధికారులు ముందస్తు హెచ్చరికలు లేకుండా సుమారు ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ'


ఆలయం వద్ద మేరిగ మురళీధర్, నాయకులు

చిల్లకూరు: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడంతో వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆయన నాయకులతో కలసి శుక్రవారం ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డితోపాటు కోట, చిట్టమూరు మండలాల కన్వీనర్లు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

నేడు ఓజిలిలో..

ఓజిలి : మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో శుక్రవారం తెలియజేశారు. దీనికి సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్‌చార్జి కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథిగా విచ్చేస్తారని చెప్పారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ దాడులు


ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలో ఉన్న పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఆంజనేయ ఆధ్వర్యంలో గురువారం ఎరువుల దుకాణాల్లో దాడులు నిర్వహించారు. విక్రయాలకు సంబంధించి ధ్రువపత్రాలు, బిల్లుల వివరాలను పరిశీలించారు. గోదాముల్లో మందుల స్టాకులను పరిశీలించారు. రిజిస్టర్‌లో పూర్తి స్థాయిలో మందుల వివరాలు నమోదు చేయని రూ.21,99,979 లక్షలు విలువ చేసే పురుగు మందులు, రూ.45,19,240 లక్షలు విలువ చేసే ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ, పి అనసూయ, మండల వ్యవసాయాధికారులు సుజాత, ప్రవీణ, శిరీష పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, కరస్పాండెంట్

కోట: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో 1996–2000 బ్యాచ్ ఇంజినీరింగ్ విద్యార్థులు సిల్వర్‌జూబ్లీ సందర్భంగా శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దేశవిదేశాల్లో స్థిరపడిన వారు ఈ కార్యక్రమానికి హాజరు కావడంతో కళాశాలలో సందడి వాతావరణం నెలకొంది. పూర్వ విద్యార్థులు ఆత్మీయ ఆలింగనం చేసుకుని కళాశాల అందించిన జ్ఞాపకాల పూదోటలో విహరించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కేవీ రెడ్డి, సుబ్బారెడ్డి, కామేశ్వర్‌ను సత్కరించారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పూర్వ విద్యార్థులను అభినందించారు.

గ్రావెల్ తవ్వకాలపై కోర్టు స్టే

చిట్టమూరు: మండలంలోని యాకసిరి పంచాయతీ అటవీ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్న విషయంపై సాక్షిలో జూలై 7న అనుమతి గోరంత, తవ్వేది కొండంత అనే కథనం వెలవడింది. దీంతో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు విచారణ అనంతరం తహసీల్దార్ ఆదేశాలను నిలుపుదల చేస్తూ, తవ్వకాలు వెంటనే ఆపాలంటూ స్టే ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కోర్టు స్టే ఇచ్చినప్పటికీ అక్రమ మార్కులు యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణ నష్టం

చిల్లకూరు: జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్న ప్రమాదంలో ప్రాణనష్టం త్రుటిలో తప్పింది. మదనపల్లెకు చెందిన ఓ కుటుంబం కారులో నెల్లూరుకు బయలు దేరింది. చిల్లకూరు వద్ద టిప్పర్ వెనుకనుంచి ఢీకొంది. దీంతో కారు పిట్టగోడను ఢీకొని ఆగింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కారు రోడ్డుకు అడ్డంగా తిరగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు అబద్ధాలను ఎండగడదాం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను ఎంత మోసం చేశాడో ఊరూరా ఎండగడదామని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని చిల్లకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన ×బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ¶ కార్యక్రమం నిర్వహించారు. కిలివేటి మాట్లాడుతూ అబద్ధాలకు నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు అని ఘాటుగా విమర్శించారు. ఏడాది కూటమి పాలనలో రూ.1.85 లక్షల కోట్లు అప్పు చేసిన మాయలోడు చంద్రబాబు అని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ తాటాకు చప్పుళ్లకు భయపకుండా చంద్రబాబు మోసాలను ప్రజల్లో ఎండగడుతామని వెల్లడించారు. టీడీపీ ఆగడాలను అడ్డుకుంటూ పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడమే తమ కర్తవ్యం అన్నారు. అనంతరం చంద్రబాబు హామీ మోసాలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, నాయకులు హరిబాబురెడ్డి, రఘునాయుడు, మోహన్, వినోద్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, జితేంద్ర, బాలు, మోహన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మునిరాజ, కృష్ణయ్య, మణి, సురేంద్ర, చెంచురామయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.